క్లుప్తంగా

మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ



గీతా మాధురికి మెడల్‌ను బహూకరిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: అనంతపురం జిల్లాలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించిన మాస్టర్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు చెందిన గీతామాధురి ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ట్రిపుల్ జంప్, లాంగ్ జంప్‌లలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు, జావెలిన్ త్రోలో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాలు సాధించారు. విజేతలకు అతిథులు, నిర్వాహకులు మెడల్స్‌ను బహూకరించారు. గీతా మాధురి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, న్యాయవాదిగా, సైకాలజిస్ట్‌గా సేవలు అందిస్తున్నారు. ప్రతిభ కనబరిచిన గీతా మాధురికి పలువురు అభినందనలు తెలిపారు.

అభివృద్ధిలో ఎంఎస్ఎంఈ సర్వే కీలకం

కర్నూలు (టౌన్): దేశ సామాజిక ఆర్థిక వృద్ధిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తాయని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలో వ్యాపారులకు సంబంధించిన ప్రతి షాపు, పరిశ్రమ నుంచి పూర్తి స్థాయిలో వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. 8 అంశాలపై సర్వే చేస్తున్నామని, తద్వారా అవన్నీ డిజిటల్ ఫ్లాట్‌ఫాంలోకి వస్తాయని తెలిపారు. ఈ సర్వేకు సూక్ష్మ చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలు సహకరించాలని కోరారు. సర్వే అనంతరం ఉద్యమ్ గుర్తింపు సంఖ్య వస్తుందని, ఈ రిజిస్ట్రేషన్ పత్రం వస్తే బ్యాంకు నుంచి రుణాల మంజూరు ప్రక్రియ వేగవంతంగా సాగుతుందని తెలిపారు. అలాగే పరిశ్రమల విధానం నుంచి వచ్చే సౌకర్యాలు, రాయితీలు పొందేందుకు అర్హత లభిస్తుందని తెలిపారు. మార్కెటింగ్ ఈ-కామర్స్ ద్వారా వ్యాపారాలు విస్తరించుకునే వీలు ఉంటుందని తెలిపారు.

వైకల్యం కలిగిన చిన్నారుల గుర్తింపునకు సర్వే



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న శ్రీనివాస్

కర్నూలు(హాస్పిటల్): పుట్టుకతో వైకల్యం కలిగిన పిల్లలుంటే తమకు చెప్పాలని చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్ స్కీమ్ కమిటీ మెంబర్ రాయపాటి శ్రీనివాస్ కోరారు. ఆరేళ్లలోపు చిన్నారుల్లో పుట్టుకతో ఉన్న, ప్రాథమిక దశ వైకల్యాలను గుర్తించేందుకు ఇంటింటి సర్వేలో భాగంగా సోమవారం 42వ వార్డులోని ఇల్లూరు నగర్, ఇందిరాగాంధీ నగర్‌లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ నెల 10వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరిగే ఈ సర్వేలో ప్రాథమిక దశలో గుర్తించగలిగిన వైకల్యాలున్న పిల్లలను ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న డీఈఐసీ సెంటర్‌కు పంపిస్తామన్నారు. ఇందులో శారీరక, మానసిక, వినికిడి, మాట ఉచ్ఛారణ సమస్యలు, గ్రహణమొర్రి సమస్య, నెలలు నిండక ముందే పుట్టిన పిల్లల సమస్యలకు ఉచితంగా చికిత్స అందించి చిన్నారుల అభ్యున్నతికి కృషి చేస్తారన్నారు.

దేవనకొండ ఆసుపత్రి తనిఖీ



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్

దేవనకొండ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే ఆసుపత్రి పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా స్కూల్‌లో జరుగుతున్న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీని తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ రఘురామిరెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారులు విజయభాస్కర్, వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, సూపర్‌వైజర్‌లు రంగస్వామి, శ్రీధర్, మద్దిలేటి పాల్గొన్నారు.

ఇల్లు అమ్మేశారన్న బాధతో ఆత్మహత్య



రాజశేఖర్ (ఫైల్)

ఆదోని అర్బన్: అప్పులు ఎక్కువ కావడంతో తల్లిదండ్రులు ఇల్లు అమ్మేయడంతో మనస్తాపానికి గురైన పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి(28) సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వాల్మీకినగర్‌కు చెందిన రాముడు, మునీంద్రమ్మలకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఇద్దరు కుమార్తెలకు తల్లిదండ్రులు అప్పు చేసి పెళ్లి చేశారు. అప్పులు ఎక్కువ కావడంతో ఇల్లు అమ్మేసి అప్పులన్నీ తీర్చారు. దీంతో చివరి కుమారుడు రాజశేఖర్ ఇల్లు వదలివెళ్లాలనే బాధను తట్టుకోలేక సోమవారం ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ రామస్వామి తెలిపారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



విద్యార్థులకు చెక్‌ను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు కల్చరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా సూచించారు. మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఏపీ రగ్బీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అస్మిత (అచీవింగ్ స్పోర్ట్స్ మైల్‌స్టోన్ బై ఇన్‌స్పైరింగ్ వుమన్ త్రూ యాక్షన్) రగ్బీ ఉమెన్స్ లీగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కలెక్టర్ రూ.2 లక్షల నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, మానసికోల్లాసంతో పాటు క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. నంద్యాల ఆర్జీఎం కళాశాలలో జరిగిన పోటీల్లో అన్ని ప్రభుత్వ ప్రైవేట్, కేజీబీవీ, ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాల జట్లు పోటీ పడ్డాయన్నారు. కంబాలపాడు, దిన్నెదేవరపాడు, లక్ష్మాపురం, ఆళ్లగడ్డ ఏపీఎస్‌డబ్ల్యూఆర్ విద్యా సంస్థల విద్యార్థులు రూ.2 లక్షలు గెలుచుకున్నారు. అనంతరం గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. డీఈఓ శామ్యూల్ పాల్, గురుకుల పాఠశాల కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, డీఎస్‌డీఓ భూపతిరావు, రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రజింత్‌బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్థిక, సామాజిక అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. ఐక్యరాజ్య సమితి 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా సహకార సంస్థ బిల్డ్ ఏ బెటర్ వరల్డ్ అనే నినాదంతో నెలవారీ లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. సహకార క్యాలెండర్ ప్రకారం నెలకు ఒక నినాదంతో అంతర్జాతీయ సహకార ముఖ్య అంశాలు, లక్ష్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, వాతావరణం చర్యలు తదితర ఏడు సిద్ధాంతాలతో సత్వరమైన సమ్మిళిత అభివృద్ధి ఉత్పత్తులు, సేవల సమృద్ధిని సాధించడమే సహకార సంఘాల లక్ష్యమన్నారు. సమావేశంలో జేసీ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, డీసీఓ రామాంజనేయులు, కేడీసీసీబీ సీఈఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే ప్రారంభం



సర్వేను ప్రారంభించిన న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం కర్నూలు న్యాయ సేవా సదన్ నుంచి ఇంటింటి సర్వేను న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లీగల్ సర్వీసెస్ వారు ఇంటింటి సర్వే నిర్వహించేందుకు న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లచే బృందాలను ఏర్పాటు చేసి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఈ నెల 10 నుంచి 24వ తేదీ వరకు విభిన్న సామర్థ్యం గల పిల్లలు, చిన్న వయస్సులోనే ఆరోగ్య లోపాలు గల పిల్లలను గుర్తించి వారికి బాలల సత్వర చికిత్స కేంద్రం ద్వారా చికిత్సలు చేయించడం జరుగుతుందని తెలిపారు. న్యాయవాదులు నాగోశేషయ్య, లక్ష్మీ నారాయణ, పారా లీగల్ వలంటీర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డీఎస్సీ జాబితాలను అందుబాటులో ఉంచాలి



డీఈఓ శామ్యూల్ పాల్‌ను కలసి విన్నవిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కర్నూలు (సిటీ): రాబోయే వేసవి సెలవుల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు నిర్వహిస్తామని విద్యాశాఖ మంత్రి ప్రకటించిన నేపథ్యంలో ఉపాధ్యాయుల టీఐఎస్ డేటాను అప్‌డేట్ చేయాలని విద్యాశాఖ అధికారులు కోరుతున్నారు. అప్‌డేట్ చేసే క్రమంలో ఆయా డీఎస్సీలో నియామకం కాబడిన హాల్ టిక్కెట్ నంబర్ కూడా కచ్చితంగా నమోదు చేయాల్సి ఉందన్నారు. జిల్లాల్లో పనిచేసే, ఇతర జిల్లాలకు బదిలీ అయిన టీచర్లందరికీ హాల్ టికెట్, సీనియారిటీ స్టేటస్ ఉపయోగపడేలా 1994 నుంచి లేటెస్ట్ 2018 డీఎస్సీ వరకు గల జాబితాలన్నింటినీ డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచాలని సోమవారం ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎ.కమలాకర్ రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ఇస్మాయిల్, ఐ.మరియానందం డీఈఓ ఎస్.శామ్యూల్‌పాల్‌ను కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ 117 జీఓ రద్దు పేరిట జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్ ప్లస్‌లను మూసివేయరాదని, అలా చేస్తే ప్రజలతో కలసి పోరాటం చేస్తామన్నారు.

పెళ్లి కావడం లేదని..

- అతిగా మద్యం సేవించి యువకుడి మృతి



మృతి చెందిన వినోద్

కర్నూలు (టౌన్): నగరంలోని నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో నివసించే ఓ యువకుడు పెళ్లి కావడం లేదని అతిగా మద్యం సేవించాడు. మద్యం మత్తులో కింద పడగా తలకు గాయాలయ్యాయి. వాంతులు చేసుకున్నాడు. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. స్థానిక ముజఫర్ నగర్‌కు చెందిన నర్సప్ప, పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తండ్రి లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చిన్న కుమారుడు టి.వినోద్ (29) ఎలక్ట్రికల్ డిప్లొమా పూర్తి చేశాడు. స్థానికంగా డాక్టర్ నరసరాం వద్ద మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. ఈతనికి పెళ్లి చేసేందుకు ఆరు సంవత్సరాలుగా తల్లిదండ్రులు సంబంధాలు చూస్తున్నారు. గతంలో ఒక సంబంధం వచ్చి నిశ్చితార్థం అయ్యింది. అయితే చివరి నిముషంలో ఆ పెళ్లి రద్దు చేసుకున్నారు. దీంతో అప్పటి నుంచి మద్యానికి బానిసై నిత్యం ఎక్కువగా తాగేవాడు. ఈనెల 9వ తేదీ సాయంత్రం 7.30 గంటల సమయంలో ముజఫర్ నగర్‌లోని ఆటోస్టాండ్ వద్ద మద్యం మత్తులో తలకు గాయమై పడి ఉన్నట్లు మిత్రుడు జి.మునిచంద్ర అనే వ్యక్తి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేశాడు. అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా తీవ్రంగా వాంతులు చేసుకొని కోలుకోలేక మృతి చెందినట్లు నాలుగవ పట్టణ పోలీసులు వెల్లడించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

పరిహారం చెల్లించి పనులు చేపట్టండి



నిరసన వ్యక్తం చేస్తున్న షాపుల యజమానులు

కర్నూలు (టౌన్): రహదారి వెడల్పులో భాగంగా తమ షాపుల స్థలాలను కూల్చివేశారని, నష్టపరిహారం ఇస్తామని చెప్పి ఇప్పుడు అభివృద్ధి పనులు చేస్తున్నారని సి.క్యాంపు షాపుల యజమానులు శ్రీనివాసులు స్పష్టం చేశారు. మున్సిపల్ అధికారులు ముందుగా తమకు నష్ట పరిహారం చెల్లించి న్యాయం చేయాలన్నారు. సోమవారం స్థానిక సి.క్యాంపులోని టీటీడీ కళ్యాణ మండపం పక్కన ఉన్న తొమ్మిది మంది షాపుల యజమానులు సీసీ రహదారి పనులు చేపడుతున్న చోట బైఠాయించారు. వెంటనే తమకు న్యాయబద్ధంగా చెల్లించాల్సిన డబ్బులు మంజూరు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాధిత షాపుల యజమానులు మాట్లాడుతూ.. 2017 సంవత్సరంలో తమ షాపులను ఏడు అడుగుల మేర కూల్చేశారన్నారు. అప్పట్లో పనిచేసిన కమిషనర్ హరినాథరెడ్డి కలిసి న్యాయం చేయాలని విన్నవించామన్నారు. స్పందించకపోవడంతో కోర్టును ఆశ్రయించామన్నారు. కోర్టులో కేసు విత్‌డ్రా చేసుకోండి. నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పడంతో కేసును ఉపసంహరించుకున్నామన్నారు. అప్పట్లో హామీ ఇచ్చిన మున్సిపల్ అధికారులు ఏడేళ్లు అవుతున్నా.. పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ నష్టపరిహారానికి సంబంధించిన టీడీఆర్ బాండ్లు మంజూరు చేయాలన్నారు. సి.క్యాంపు షాపుల యజమానులు అబ్దుల్ రెహమాన్, ఫారూక్, ఖాజా మొహిద్దీన్, సయ్యద్ ఖాసీమ్, కొండారెడ్డి, మంగమ్మ, ఉదయ్‌కుమార్, గోపాల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

ఆదోని వాసికి కామధేను పురస్కారం



కామధేను పురస్కారంతో సన్మానిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణానికి చెందిన గరుడాద్రి దత్తాత్రేయశర్మకు కామధేను పురస్కారం లభించింది. నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట లలితా పరమేశ్వరి పీఠంలో సోమవారం లలితా భరద్వాజ దత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ రామాయణం మహేశ్వరస్వామి వారి ఆధ్వర్యంలో కామధేను పురస్కారాల కార్యక్రమం జరిగింది.

రమణీయం.. లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



శ్రీ లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం



పూర్ణకుంభంతో వస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మసీదపురం గ్రామంలో సోమవారం సాయంత్రం లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. దేవాలయంలో ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం హనుమప్పనాయుడు ఇంటి నుంచి స్వామివారికి నైవేద్యాన్ని పూర్ణకుంభంతో తీసుకువచ్చారు. పూజారి ఈరన్న పూజలు చేసిన అనంతరం స్వామి వారి రథోత్సవం భక్తుల జయజయ హర్షధ్వానాల మధ్య ముందుకు సాగింది.

బ్రాహ్మణులపై దాడులను ఉపేక్షించం

కర్నూలు(అర్బన్): బ్రాహ్మణులపై దాడులు జరిగితే ఉపేక్షించేది లేదని, ప్రతి చర్యలు ఉంటాయని అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవళ్ల వసంత సాయినాథ శర్మ, దక్షిణాంధ్ర కో-ఆర్డినేటర్ ప్రతాపగిరి సునీల్‌కుమార్ హెచ్చరించారు. చిలుకూరు బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ వారు సోమవారం స్థానిక సంఘ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో బ్రాహ్మణులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు ఓపికగా సహనంగా భరిస్తూ వచ్చామని, ఇక ప్రతి చర్యలు తప్పక ఉంటాయన్నారు. ప్రధాన అర్చకుడిపై దాడికి పాల్పడిన వీర రాఘవరెడ్డి, అతని అనుచరులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. జరుగుతున్న సంఘటలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం బ్రాహ్మణ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావాలన్నారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు ప్రారంభిస్తామన్నారు. ఏబీబీఎం సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివనామావళి పారాయణం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ కుమ్మరి వీధిలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో మాఘ మాసం సోమవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివదీక్షా స్వాములు శివ నామావళి అఖండ పూజ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమై మంగళవారం ఉదయం 6 గంటల వరకు కొనసాగనుంది. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నేడు ఘంటసాల వర్ధంతి

కర్నూలు కల్చరల్: పద్మశ్రీ ఘంటసాల గాన కళా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 8.30 గంటలకు ఆయకార్ భవన్ ఎదురుగా ఉన్న ఘంటసాల విగ్రహం వద్ద పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 51వ వర్ధంతిని నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు ఎస్.వాసుదేవమూర్తి తెలిపారు. డాక్టర్లు డబ్ల్యూం సీతారాం, భవానీ ప్రసాద్, పి.చంద్రశేఖర్, బి.శంకర్ శర్మ, ఎ.నగేష్, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తిఓబులయ్య, ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు.

టౌన్‌ప్లానింగ్ ఏసీపీపై విచారణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేసి ప్రస్తుతం విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న సిరిగిరి శాస్త్రీ షణ్ముం అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ జీఓ 93 జారీ చేశారు. విచారణ అధికారిగా కర్నూలు రేంజ్ అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ బి.క్రిష్ణయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2019 సంవత్సరం జనవరిలో కర్నూలు నగరపాలక సంస్థలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న ఆయన్ను నగరానికి చెందిన ఒక వ్యక్తి కలిశాడు. రెండు ఇళ్ల స్థలాలకు సంబంధించి లేఔట్ల ప్లానులు కావాలని అడిగాడు. ఆయన జాప్యం చేయడంతో చివరకు రూ.20 వేలు లంచం ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. దీనిపై బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారి సూచనల మేరకు కార్యాలయంలోని ఆయన సీటు వద్ద ఏసీపీ లంచం తీసుకుంటుండగా అప్పట్లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. దీంతో ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అప్పట్లో చేపట్టిన విచారణకు సంబంధించిన వివరాలతో పాటు మరోసారి పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

27న బుగ్గ రామేశ్వరుని కల్యాణం

ఓర్వకల్లు: మండలంలోని కన్నమడకల సమీపంలో వెలసిన బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకల సందర్భంగా స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు లఘ్న పత్రికను సోమవారం రూపొందించారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో అర్చకులు చంద్రశేఖరశర్మ లఘ్న పత్రికను లిఖించి స్వామివారి పాదాల చెంత ఉంచి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఓకు సమర్పించారు. మూడు రోజుల పాటు నిర్వహించే వేడుకల వివరాలను ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా ఈ నెల 25న సాయంత్రం కన్నమడకల నుంచి ఉత్సవమూర్తులు బుగ్గ క్షేత్రానికి వరప్రయాణం చేస్తారు. 26న ఉదయం స్వాముల వారికి అభిషేకాది పూజలు, రాత్రి జాగరణ సందర్భంగా కొచ్చెరువుపల్లె వారిచే శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి జీవిత చరిత్ర పౌరాణిక నాటక ప్రదర్శన, 27న స్వామివారి కల్యాణోత్సవం, అన్నదానం ఉంటుందని వెల్లడించారు.

మొరాయించిన సర్వర్



పన్నుదారులకు నచ్చజెపుతున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు (టౌన్): ఈ నెల 30వ తేదీ జరిగిన నగరపాలక సర్వసభ్య సమావేశంలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మాట్లాడుతూ.. కొంతకాలంగా నగరపాలక సంస్థలో నెలకొన్న సర్వర్ సమస్యను పరిష్కరించినట్లు స్పష్టం చేశారు. కమిషనర్ చెప్పి పట్టుమని 10 రోజులు కూడా కాలేదు. మరోసారి నగరపాలక సంస్థ కార్యాలయంలో సర్వర్ మొరాయించింది. నెల రోజుల వ్యవధిలో పన్ను చెల్లింపు గడువు ముగుస్తున్నందున ఇంటి పన్ను, నీటి పన్ను చెల్లించేందుకు ఉదయం, సాయంత్రం పౌరులు తరలివచ్చి క్యూలైన్లలో నిలబడి పన్నులను చెల్లిస్తున్నారు. అలాగే రెండవ శనివారం, ఆదివారం రెండు రోజులు సెలవులు రావడంతో సోమవారం ఉదయం నుంచి పన్నుదారులు క్యూలైన్లలో నిలబడి పన్నులు చెల్లించేందుకు తరలివచ్చారు. అయితే ఎంతసేపు వేచిఉన్నా సర్వర్ ప్రాబ్లమ్ అంటూ సమాధానం రావడంతో పన్నుదారులు అసహనం వ్యక్తం చేశారు. కొంత మంది వాగ్వాదానికి దిగారు. పదే పదే ఇదే సమస్య వస్తోందని, పట్టించుకోరా అంటూ పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

స్పందించిన అధికారులు

సర్వర్ మొరాయించడంతో పన్నులు చెల్లించేందుకు అవకాశం లేక మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారన్న విషయం తెలుసుకున్న నగరపాలక మేనేజర్ చిన్న రాముడు పన్ను చెల్లింపు కౌంటర్లను పరిశీలించారు. సమస్యను నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ.క్రిష్ణ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన అదనపు కమిషనర్ వెంటనే రాష్ట్ర పురపాలక శాఖ సాంకేతిక సిబ్బందితో మాట్లాడారు. అప్పటికప్పుడే సర్వర్ సమస్యను పరిష్కరించారు. ఎట్టకేలకు మరోసారి పన్నుల చెల్లింపులు ప్రారంభమయ్యాయి. ఈ సమస్య ప్రతి ఏడాది వస్తోంది. పదే పదే ఈ సమస్య వస్తున్నా శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు ఉన్నాయి. వచ్చే నెల మార్చిలో పన్నుల చెల్లింపుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. ఇప్పటి నుంచే సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పన్నుదారులు కోరుతున్నారు.

ఎల్లమ్మకు పల్లకీ సేవ



ఉత్సవమూర్తి ఎల్లమ్మ దేవి



వెంకాయపల్లెలో అమ్మవారి పల్లకీ ఊరేగింపు

కర్నూలు(రూరల్): వెంకాయ పల్లె గ్రామ సమీపాన వెలసిన ఎల్లమ్మకు బార్లాల పౌర్ణమి (అమ్మవారి జయంతి) ఉత్సవాల ప్రారంభం సందర్భంగా సోమవారం పల్లకీ సేవ కార్యక్రమాన్ని ఈఓ పి.యస్.రాధాక్రిష్ణ, అశేష సంఖ్యలో హాజరైన భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ ప్రాగణం నుంచి వెంకాయ పల్లె గ్రామానికి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామంలోని మహిళలు, భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, టెంకాయలు, నిమ్మకాయలదండ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘంటసాలతో అనుబంధం మరచిపోలేనిది



కళాకారులను సన్మానిస్తున్న అతిథులు, నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: ఘంటసాలతో మరచిపోలేని అనుబంధం ఉందని సినీ రచయిత డాక్టర్ ఎంకే రాము అన్నారు. ఘంటసాల గాన కళా సమితి, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో సీక్యాంప్ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఘంటసాల పాటల పండుగ రెండో రోజు సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ సి.నారాయణరెడ్డి, నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావుతో రసమయి సాహితీ సాంస్కృతిక సంస్థను హైదరాబాద్‌లో స్థాపించి 57 సంవత్సరాలు అయిందన్నారు. వందలాది మంది కళాకారులను సత్కరించి సాహిత్య కార్యక్రమాలు చేశానన్నారు. కర్నూలుతో తనకు విడదీయరాన్ని అనుబంధం ఉందన్నారు. డిగ్రీ వరకు కర్నూలులోనే చదువుకున్నానన్నారు. కార్డియాలజిస్ట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుంచి హార్ట్ ఫౌండేషన్ ద్వారా కర్నూలులో ఘంటసాల సంగీత విభావరిని నిర్వహిస్తున్నామన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తిఓబులయ్య, ఘంటసాల గాన కళా సమితి అధ్యక్షుడు టీఎస్ రావు మాట్లాడారు. అంతకుముందు అతిథులు జ్యోతి ప్రజ్వలనతో రెండో రోజు ఉత్సవాలను ప్రారంభించారు. ఘంటసాల గానం చేసిన భగవద్గీతతో పాటు ఆయన పాడిన పాటలను గాయకులు పీవీ రమణ, అఖిల పాడి అలరింపజేశారు. గాయకులను అతిథులు సత్కరించారు. కళాక్షేత్రం పధాన కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు యాంగటేశ్వరప్ప, బాలవెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రహదారులను బాగుచేయండి

- సీసీ రోడ్లు నిర్మించాలి
- మురుగు కాల్వలపై అక్రమ కట్టడాలు తొలగించాలి
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పలువురి విన్నపాలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ

కర్నూలు (టౌన్): నగరంలోని 105వ సచివాలయం పరిధిలోని విజయలక్ష్మీనగర్‌లో మట్టి రహదారులు అధ్వానంగా తయారయ్యాయని, వాటి స్థానంలో సీసీ రోడ్లు నిర్మించాలని స్థానికులు ప్రవీణ్‌బాను, నాగరాజు, రవి విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు తమ కాలనీల సమస్యలకు సంబంధించి వినతులు అందజేశారు. దీనిపై స్పందించిన అదనపు కమిషనర్ ప్రజల వినతులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మున్సిపల్ ఎస్ఈ రాజశేఖర్, టీపీఆర్ఓ వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

విన్నపాలు ఇవే..

- వీకర్ సెక్షన్ కాలనీ సమీపంలోని దిలీప్ నగర్‌లో సీసీ రహదారి నిర్మించాలని స్థానికులు జానకీరామిరెడ్డి, రమణరెడ్డి విన్నవించారు.
- వెంకటనాయుడు కళ్యాణ మండపం సమీపంలోని బాలాజీనగర్‌లో రహదారులు, మురుగు కాల్వలు నిర్మించాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు.
- మురుగు కాల్వలపై నిర్మాణాలు చేపట్టడం వల్ల పూడికతీత పనులకు ఇబ్బందిగా మారి దుర్వాసన వస్తోందని 21వ వార్డు శ్రీలక్ష్మీనగర్‌కు చెందిన శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు.
- 17వ వార్డు సప్తగిరి నగర్‌లో మురుగు కాల్వలు ఏర్పాటు చేయాలని అలాగే 20వ వార్డు కళావతి నగర్‌లో వీధి దీపాలు వెలగటం లేదని సీపీఐ ప్రతినిధి రామక్రిష్ణా రెడ్డి, స్థానికులు మహేష్ విన్నవించారు.
- చిదంబరరావు వీధి రహదారి మధ్యలో నిరుపయోగంగా ఉన్న బోరు ప్రమాదకరంగా ఉందని, వెంటనే తొలగించాలని స్థానికులు పురుషోత్తం అభ్యర్థించారు.